www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 17 మార్చి 2023
5
అన్నమయ్య

పిడుగుపాటుకు యువకుడి మృతి

మృతి చెందిన జహంగీర్‌బాబా

ప్రజాశక్తి-కలికిరి

పిడుగుపాటుకు యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వాతావరణంలో మార్పులతో అకాల వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. వాల్మీకిపురం మండలం పరిధిలోని సాయిరాం డాబా సమీపంలో పిడుగు పడటంతో ఆ సమీపంలో అక్కడే ఉన్న కలికిరి చెందిన జహంగీర్ బాబా(45) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆయనతోపాటు మరో నలుగురికి స్వల్ప గాయాలైనట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కలికిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

అర..కోరే!

- 2025 నాటికి జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2
- 'ఉక్కు' రూ.2,200 కోట్లు కేటాయింపు
- కొప్పర్తి, వైఎస్ఆర్ ఇఎంసి ప్రస్తావన
- రాయచోటిలో పారిశ్రామిక శిక్షణా సంస్థ
- పులివెందుల్లో ముర్రాజాతి గేదెల ఉత్పత్తి
- యోగి వేమన యూనివర్శిటీకి రూ.32.83 కోట్లు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్ర బడ్జెట్-2023 అరకొర కేటాయింపులతో సరిపెట్టింది. జిల్లా ప్రగతి చోదకశక్తులైన ఇరిగేషన్, వ్యవసాయం, పారిశ్రామిక, సేవల రంగాలకు ఆశించిన స్థాయిలో కేటాయింపులు చేయలేదు. జిల్లాలో ఉక్కు పరి శ్రమ ఏర్పాటుకు రూ.2,200 కోట్లు, పులివెందులలో ముర్రాజాతి గేదెల ఉత్పత్తి, కొప్పర్తి పారిశ్రామికవాడ, వైఎస్ఆర్ ఎలక్ట్రానిక్ క్లస్టర్‌లో పరిశ్రమల ఏర్పాటుకు మౌలిక సదుపాయాల కల్పన, రాయచోటిలో పారిశ్రామిక శిక్షణా సంస్థ వంటి పేర్లతో ఊరట కలిగించే ప్రయత్నం చేయడం గమనార్హం. నిధుల కేటాయింపుల వివరాలల్లో స్పష్టత కనిపించకపోవడం నిరుత్సాహాన్ని కలిగించింది. ఏదేమైనా జిల్లాలో సాగునీటి పారుదల, పారిశ్రామిక రంగాల కేటాయింపులను పరిశీలిస్తే మొక్కుబడి కేటాయింపుల్ని తలపించిందని చెప్పవచ్చు. రాష్ట్ర బడ్జెట్ -2023-24ను ఆర్థికశాఖామంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్‌రెడ్డి రూ.2,79, 279 కోట్లతో ప్రవేశపెట్టారు. జిల్లాకు సంబంధించిన కేటాయింపులను పరిశీలిస్తే నిరుత్సాహాన్ని కలిగించింది. సాగునీటి పారుదల రంగ కేటాయింపులను పరిశీలిస్తే జిఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్, కెసికెనాల్ కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలతో ముడిపడి ఉండడంతో స్పష్టత లోపించింది. గతేడాది జిఎన్ఎస్ఎస్‌కు రూ.439. 30కోట్లు కేటాయించగా తాజాగా రూ.855.35 కోట్లు, పిబిసికి గతేడాది రూ.238.95 కోట్లు కాగా తాజాగా రూ.106.59 కోట్లు, హెచ్ఎన్ఎస్‌కు రూ.122.69 కోట్లు, వెలిగల్లుకు రూ.1.5 కోట్లు, చెయ్యేరుకు రూ.20 లక్షలు కేటాయింపులతో సరిపెట్టారు. గత బడ్జెట్‌లో సాగు నీటిపారుదల రంగానికి రూ.8,087 కోట్లు కేటాయించడం తెలిసిందే. 2023-24 బడ్జెట్‌లో రూ.1542.17 కోట్లు కేటాయించినట్లు కనిపి స్తోంది. పారిశ్రామిక రంగాన్ని పరిశీలిస్తే ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు రూ.2,200 కోట్లు, కొప్పర్తి, వైఎస్ఆర్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో పరిశ్రమల ఏర్పాటుతో 35 వేల ఉద్యోగాలు వస్తాయనే మొక్కుబడి ప్రస్తావన చేసింది. పులివెందుల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, పులివెందుల్లో వెటర్నరీ బయోలాజికల్ ఇన్సిట్యూట్‌లో ముర్రాజాతి గేదెల ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది. యోగి వేమన యూనివర్శిటీకి రూ.32.83 కోట్లు, సిపిబ్రౌన్‌కు రూ.10 లక్షలు, చొప్పున కేటాయించారు. ఉమ్మడి జిల్లాలోని 4.80 లక్షల మంది రైతులకు వైఎస్ఆర్ రైతు భరోసా, రూ.500 కోట్లతో సున్నా వడ్డీ పథకం కింద లబ్ధిపొందనున్నారు. జిల్లా సర్వజన ప్రభుత్వాస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అప్‌గ్రెడేషన్, ఉమ్మడి జిల్లాలోని అన్నమయ్య, పింఛా, ఎల్ఎస్‌పి, కుందూ-పెన్నా, కాలేటివాగు ఎత్తిపోతల పథకాల పనులకు సంబంధించిన కేటాయింపుల ప్రస్తావన చేయలేదు.

కాకి లెక్కల బడ్జెట్

జగన్ ప్రభుత్వం, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్ర ప్రవేశపెట్టిన 2023-24 రాష్ట్ర బడ్జెట్ 'కాకి లెక్కల బడ్జెట్' గా ఉంది. ఉత్పాదక, ఉపాధి రంగానికి రాష్ట్ర బడ్జెట్లో కేవలం రూ. 30 వేల కోట్లు మాత్రమే చూపించారు. గతలోనూ 32 వేల కోట్లు చూపించి, రూ. 16 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదు. 'జాబ్ క్యాలెండర్' ప్రస్తావన లేకుండానే ముగించేశారు. జిల్లాలోని ప్రాజెక్టుల కింద పంట కాలవల నిర్మాణానికి నిధులు ఈ బడ్జెట్లో విస్మరించారన్నారు.

-జి.చంద్రశేఖర్, సిపిఎం జిల్లా కార్యదర్శి

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తికావు

2023-24 వార్షిక సంవత్సరానికి రూ. 2,79,279 లక్షల కోట్ల కేటాయింపులో నీటి పారుదల , పారిశ్రామిక రంగాలనే పూర్తిగా విస్మరించారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి కూడా కావు. జిల్లాలో గాలేరు-నగరి, హంద్రీ నీవా, రాజోలి నిర్మాణ, తెలిపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పూర్తవడం సాధ్యం కాదు. వ్యవసాయ రంగానికి నిధులను అంకెల గారడితో కేటాయించారు.

- గాలి చంద్ర, సిపిఐ జిల్లా కార్యదర్శి.

పారిశ్రామిక అభివృద్ధి అసాధ్యం

బుగ్గన ప్రవేశపెట్టిన 2023 -24 ఆర్థిక సంవత్సర బడ్జెట్ వల్ల రాష్ట్ర అభివృద్ధి ఏమాత్రం జరగదని, కేవలం సంక్షేమానికి మాత్రమే కొద్దిగా ప్రాధాన్యతను ఇచ్చారు. పారిశ్రామిక అభివృద్ధికి ఈ బడ్జెట్లో ఒరిగిందేమీ లేదన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీకి రూ. 20 కోట్లు కేటాయించి ఉంటే జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధి బయటపడి ఉండేది. నిరుద్యోగులకు మొండిచెయ్యి చూపించారు.

- కాంగ్రెస్ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు

విద్యారంగానికి తూట్లు

2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి 10.6 శాతం నిధులు కేటాయించిందని, గత సంవత్సరంతో పోల్చితే 0.2 తక్కువ నిధులు కేటాయించడం దారుణమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్ల విద్యార్థుల సంఖ్య పెరిగిందని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం అమ్మఒడికి ఒక్క రూపాయి అదనపు కేటాయింపులు చేయలేదు.

- యుటిఎఫ్ అధ్యక్షులు మాదన విజయ కుమార్

రైతుకు భరోసా ఇవ్వని బడ్జెట్

వ్యవసాయం, అనుబంధ రంగాలకు బడ్జెట్ కేటాయింపులు తగినంతగా లేవు. పంట రుణాలకు రూ.2500 కోట్లు అవసరమైతే రూ.500 కోట్లు కేటాయించారు. డ్రిప్ పరికరాలను మెట్ట ప్రాంత రైతులకు అందించడానికి అవసరమైన నిధులు కేటాయించకపోవడం శోచనీయం.

-బి. దస్తగిరిరెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

నిరుద్యోగులకు నిరాశ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో అన్ని రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం మంచి పరిణామైనప్పటికీ నిరుద్యోగులకు ఒకరకంగా ఇది నిరాశ పరిచినట్లే చెప్పవచ్చును. నూతన ఉద్యోగ నియామకాలు మీద బడ్జెట్‌లో ప్రస్తావన లేక పోవడం బాధాకరం. రోజుకు పెరుగుతున్న మానవ వనరుల దృష్టిలో పెట్టుకొని సంబంధించిన ఉద్యోగ నియామకాలు చేపడితే సుస్థిరంగా అభివృద్ధి సాధ్యమవుతుంది.

-డాక్టర్ రమేష్ పిచ్చాయ్. ఆర్థిక శాఖ విశ్లేషకులు, కడప.

ఏప్రిల్ 30 నాటికి భూ సేకరణ పూర్తి కావాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

ఝరికోన, గాలివీడు, రామాపురం, ఎల్ఆర్‌పల్లె లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి భూ సేకరణ ఏప్రిల్ 30 నాటికి పూర్తి చేయాలని తహశీల్దార్లను కలెక్టర్ గిరిష పిఎస్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో భూసేకరణ వేగవంతంపై సంబంధిత తహశీల్దార్లు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఝరికోన, గాలివీడు, రామాపురం , ఎల్ఆర్ పల్లె లిఫ్ట్ ఇరిగేషన్ భూ సేకరణ ఎంత చేశారు, ఎంత చేయాలి, ఏ స్టేజిలో ఉంది, తదితర వివరాలు అడిగి తెలుసుకుని ప్రాధాన్యత క్రమంలో ఏప్రిల్ చివరి నాటికి భూసేకరణ ప్రక్రియలను పూర్తిచేయలని సంబంధిత సూచించారు. ప్రతివారమూ భూ సేకరణలో జరిగిన పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ సంబంధించి భూసేకరణ సర్వే పనులు, ఎ 2 తయారుచేసి సోమవారంలో నివేదికలు పంపాలని సూచించారు. సర్వే చేసేటప్పుడే రికార్డులన్నీ కూడా తీసుకోవాలన్నారు. భూ సేకరణ ప్రక్రియలో ఏప్రిల్ 7లోగా ప్రభుత్వ భూములు అప్పగించాలన్నారు. ఏప్రిల్ 21, డిఎల్ఎస్‌సి పూర్తి కావాలన్నారు. తర్వాత ఏప్రిల్ 30లోగా ఫామ్ ఎఫ్ రావాలన్నారు. తహశీల్దార్లందరూ సీరియస్‌గా తీసుకుని పనిచేయాలన్నారు. నిర్దేశించిన గడువులోగా పనులను వేగవంతం చేస్తూ పూర్తి చేయాలన్నారు. కలిబండా, బెస్తపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ సంబంధించి ల్యాండ్ ప్లాన్ షెడ్యూల్స్ 15 రోజుల్లోగా ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. లెక్కిరెడ్డిపల్లె మండలంలో జరుగుతున్న చెరువు పనులను పరిశీలించానని, వేగవంతంగా జరుగుతున్నాయని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ అభినందించారు. ఈ చెరువు పనులు పూర్తయి చెరువులో నీళ్లు వస్తే భూగర్భ జలాలు పెరుగుతాయని, తద్వారా రైతులకు మేలు కల్గుతుందని చెప్పారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా పనులను వేగవంతం చేయాలన్నారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, ఇరిగేషన్ జిల్లా అధికారి కృష్ణమూర్తి, కలెక్టరేట్ భూ సేకరణ విభాగం సూపరింటెండెంట్ మహేశ్వర రెడ్డి, తహశీల్దార్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ : టిడిపి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గంటా నరహరి, బత్యాల చెంగల్రాయుడు

ప్రజాశక్తి- రాయచోటి

అధికార పార్టీ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని టిడిపి రాజంపేట పార్లమెంటు అభ్యర్థి గంటా నరహరి ఆవేదన చెందారు. అధికార పార్టీ వారు ఎమ్మెల్సీ ఎన్నికల్లో చేసిన అతిక్రమణలపై గురువారం రాయచోటిలోని జిల్లా కలెక్టర్ గిరీశకు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల రాయుడు, నాయకులతో కలిసి ఘంటా నరహరి ఫిర్యాదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ంమాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తూ ఒకపక్క అధికార వైసీపీ నేతలు ఇష్టానుసారం వ్యవహరిస్తుంటే, మరోపక్క అధికారులు వారికి వత్తాసు పలకడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నట్టుగా ఉందని అన్నారు. అధికార పక్షానికి ఒకలా, ప్రతిపక్షానికి మరోలా చట్టాలుంటాయా అని ప్రశ్నించారు. వీటన్నింటిపై అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు, పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తూ మెమరాండం సమర్పించారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కూనీ చేసేలా వ్యవహరిస్తున్న అధికార పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారని నరహరి వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో టిడిపి లీగల్ సెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు పెయింటింగ్ పోటీలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని కోళ్ళ బైలు పంచాయతీ అమ్మచెరువుమిట్ట వద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ప్రతిభావంతులకు జాతీయ సైన్స్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఢిల్లీలోని యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా వారు యునెస్కో వారి సహకారంతో విభిన్న ప్రతిభావంతులకు జాతీయ సైన్స్ పెయింటింగ్ కాంపిటేషన్‌ను నిర్వహించారు. ప్రపంచ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా ఈ సంవత్సరం యునెస్కో యొక్క థీమ్ మన జీవితంలో మహిళల యొక్క ప్రాముఖ్యత, సమాజంలో మార్పులు తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్‌లో వెలుగు ప్రత్యేక పాఠశాలను రిజిస్టర్ చేసుకుని 55 మంది విభిన్నప్రతిభావంతులను నిబంధనల మేరకు వయస్సుల ఆధారంగా ఎ, బి, సి అని మూడు గ్రూపులుగా విభజించి, వీరందరికి మన జీవితంలో మహిళల యొక్క ప్రాముఖ్యత అనే విషయం మీద అవగాహన కోసం పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. మన జీవితంలో పుట్టుక నుంచి మరణం వరకు స్త్రీ ప్రాముఖ్యత ఎంతో ఉందనీ, నేటి సమాజంలో స్త్రీ అన్ని రంగాలలో ముందుకు సాగిపోతుందని తెలియజేస్తూ దివ్యాంగులు వారి సామర్థ్యాన్ని బట్టి పెయింటింగ్ వేశారు. ఈ పెయింటింగ్స్ ను యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ వారు పరిశీలించి పాల్గొనిన అందరికి సర్టిఫికెట్ మరియు విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, మెడల్స్ అందజేస్తామని ఆన్‌లైన్ ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఉదయ మోహన్‌రెడ్డి, వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, వెలుగు ప్రిన్సిపల్ పి.లీనాకుమారి, వెలుగు చిన్నారులు, టీచర్లు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్‌పిలను కలిసిన వక్ఫ్‌బోర్డు చైర్మన్

మదనపల్లె: కలెక్టర్, ఎస్‌పిలను జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎస్.ఎ. కరీముల్లా గురువారం మర్యాదపూరకంగా కలిశారు. వక్ఫ్‌రోడ్డు ఆస్తులు పరిరక్షణ గురించి వారితో చర్చించారు. క్షేత్రస్థాయిలో ప్రతి వారమూ పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను, అవసరాలను, మౌలిక సౌకర్యాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలను గుర్తించి పరిష్కరిస్తానని కరిముల్లా చెప్పారు. అనంతరం వారిని ఆయన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ అన్వర్, పయాజ్ ఖాన్, చాన్ బాషా, రఫీతోపాటు పలువురు పాల్గొన్నారు.

పంటను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి సాధ్యమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ అన్నారు. గురువారం మండలంలోని టి.సాకిరేవుపల్లిలో రైతు చంటి రెండు ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన టమోటా, బీన్స్, పెసర, మిరప, వంగ, అరటి, ఉల్లి, కొబ్బరి, ఆముదం, బంతి, వరి పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన వరి పంటకు ఉపయోగించే ద్రవజీవామృతంను పరిశీలించారు. అయ్యవారిపల్లిలో మహిళా రైతు ఉషా, బూడిదవేడులో మహిళా రైతు లలిత పంటలను పరిశీలించి, పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది స్వాతి, శ్రీనివాసులు, రెడ్డిబాషా, సావిత్రి, పెద్ద రెడ్డయ్య, వినోద్, భాస్కర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రజతోత్సవ వేడుకల కరపత్రాలు విడుదల

మదనపల్లె అర్బన్: మదనపల్లె రచయితల సంఘం కార్యాలయంలో గురువారం రజతోత్సవ వేడుకల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల రచయితల సంఘం అధ్యక్షులు పి.వి. ప్రసాద్, ప్రధాన కార్యదర్శి లింగాల యుగంధరాచారి మాట్లాడుతూ సంఘం 25వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 22న చిత్తూరు బొంతలవారి కల్యాణమండలంలో వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అన్నమయ్య కీర్తనలు, మురళీ వేణుగానం, కవితాపఠనం, బలరాముడు ఏకపాత్రాభినం, సన్మానాలుంటాయని, తప్పక హాజరు కోవాలని కోరారు.

యువగళం పాదయాత్రలో ఖాదర్‌బాషా

రాయచోటి: తంబళ్లపల్లి నియోజకవర్గం బి.కొత్తకోటలో గురువారం నిర్వహించిన యువగళం పాదయాత్రలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తండోపతండాలుగా వచ్చి నారా లోకేష్ బాబు పాదయాత్రకు బ్రహ్మరథం పట్టారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మైనార్టీలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి ఆదుకుంటుందని చెప్పారు. రైతులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. తంబళ్లపల్లె వైసిపి ఎమ్మెల్యేకు గుణపాఠం చెప్తామనిచెప్పారు.

కుక్కల బెడద నుంచి విముక్తి

రాజంపేట అర్బన్: పట్టణంలో పేట్రేగిపోతున్న కుక్కల దాడుల నుంచి ప్రజలను రక్షించేందుకు మున్సిపల్ చైర్ పర్సన్ పోలా శ్రీనివాసులు రెడ్డి తిరుపతిలోని యానిమల్ కేర్ ల్యాండ్ వారి ద్వారా కుక్కలను పట్టుకునేందుకు గురువారం నుంచి శ్రీకారం చుట్టారు. యానిమల్ కేర్ ల్యాండ్ వారి ద్వారా పట్టణంలో విచ్చలవిడిగా తిరుగుతున్న వీధి కుక్కలను పట్టుకొని వాటిని జనావాసాలకు దూరంగా సురక్షితమైన ప్రాంతాలకు తరలించే విధంగా కార్యాచరణను ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా పట్టణ ప్రజలకు కుక్కల బెడద నుంచి విముక్తి కలగనుంది. ఈ సందర్భంగా పోలా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండాఎటువంటి కార్యాచరణకైనా సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.జనార్దన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్లు డొంకా సురేష్, ఎస్ఎండి న్యామతుల్లా, నవీన్‌కుమార్, తంబా సుబ్రహ్మణ్యం, ఖాజా మొహిద్దీన్, తోట లక్ష్మీనారాయణ, రాజేష్, గోవిందు బాలకృష్ణ పాల్గొన్నారు.

కుక్కలను తరలిస్తున్న సిబ్బంది

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

'భూసేకరణ వేగవంతం చేయాలి'

రాయచోటి: ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాంచిన మంగంపేట బైరటిస్ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాంచిన మంగంపేట బైరటిస్ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ, ఆర్అండ్ఆర్ కాలనీ పురోగతిపై జెసి, రాజంపేట సబ్ కలెక్టర్, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగంపేట బైరటిస్ ప్రాజెక్టుకు సంబంధించి అధిక ప్రాధాన్యత ఇచ్చి భూసేకరణ పూర్తితో పాటు త్వరగా ఆ భూమిని అప్పజెప్పాలని తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. మంగంపేట ఆర్అండ్ఆర్ కాలనీ కోసం తాగునీరు, డ్రెయినేజీ కాల్వల అంచనా నివేదికను తయారుచేసి పంపాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇని కలెక్టర్ ఆదేశించారు. కాలనీకి విద్యుత్ కనెక్షన్ కోసం నివేదిక రెండు రోజులు ఇవ్వాలని విద్యుత్ ఎస్‌కి సూచించారు. ఎంత భూమికి పరిహారం చెల్లింపు చేశారు, సర్వే నెంబర్ వారీగా ఎంత భూమిని అప్పజెప్పారనే అంశాలను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. భూమి స్వాధీనం, భూమి అప్పగింత, ఎస్టిమేషన్, డిపిఆర్ తదితర రిపోర్టులన్నీ వచ్చేవారంలోగా ఇవ్వాలని సూచించారు. పులపుత్తూరు, మంగంపేట ప్రాంతాలను వారానికి ఒకసారి పరిశీలించి అక్కడ పురోగతి కనిపించేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, ఓబులవారిపల్లి తహశీల్దారు పీరు మున్నీ, కలెక్టరేట్ భూ సేకరణ విభాగం సూపర్డెంట్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న మహిళా పోలీస్

రాయచోటి టౌన్ : రాయచోటి జూనియర్ కళాశాల కేంద్రంలో గురువారం పరీక్ష రాస్తున్న విద్యార్థికి ఆర్థిక సాయం చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు మహిళా పోలీస్. వివరాలు.. దేవపట్లకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి కుంచెపు నాగేంద్ర అనే విద్యార్థి రాయచోటి జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వచ్చాడు. పరీక్ష రాసే సమయంలో తీవ్ర అనారోగ్యానికి గురై రక్తపు వాంతలు చేసుకున్నాడు. ఆ సమయంలో అక్కడ ఉన్న పరీక్షల నిర్వహణ సిబ్బందిని విచారించగా నాగేంద్రకు రెండు రోజుల నుంచి జ్వరం వస్తోంది, ఇదే క్రమంలో పరీక్షలు రాసే సమయంలో ఒత్తిడికి గురికావడంతో రాక్తపు వాంతులు వచ్చాయని పరీక్ష కేంద్రం బయట ఉన్న విద్యార్థి తల్లి పేర్కొంది. ఆమె వ్యవసాయ కూలీ కావడంతో గమనించి మహిళా పోలీసు లక్ష్మి వెంటనే స్పందించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.వెయ్యి ఆర్థిక సాయం అందించారు. మానత్వంతో స్పందించిన మహిళా పోలీసును తోటి సిబ్బంది, స్థానికులు అభినందించారు.

నాటుబాంబు కొరికి...కుక్కకు తీవ్ర గాయాలు

గాయపడిన కుక్క

నిమ్మనపల్లి: మండల పరిధిలో ఎర్రప్పగారిపల్లి సమీపంలో పంట పొలాల వద్ద వన్యమృగాల వేటలో భాగంగా అమర్చిన నాటు బాంబును ఓ కుక్క కొరికి గాయాలపాలైంది. స్థానికుల కథనం మేరకు.. ఎర్రప్పగారిపల్లి సమీపంలో నూరు కుప్పలకొండ అటవీ ప్రాంతమైనందున గ్రామానికి సమీపంలో రైతులు సాగు చేసిన పొలాల్లోకి తరచూ వన్యమృగాలు వస్తుంటాయి. గుర్తు తెలియని వేటగాళ్లు నాటుబాంబులను, కరెంట్ తీగలను అమర్చి వాటిని వేటాడేవారు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఒక కుక్క పొలాల వద్ద అమర్చిన నాటు బాంబును గ్రామానికి తీసుకొచ్చి కొరకడంతో బాంబు ఒక్కసారిగా పేలింది. ప్రమాదంలో కుక్క నోటికి తీవ్ర గాయాలయ్యింది. ఎర్రప్పగారిపల్లె సమీంలోని మోట్ల చెరువు వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి తీగలను అడవిలోకి అమర్చి వన్యమృగాలను వేటాడుతుంటారు. వేటగాళ్లపై అటవీశాఖాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువతను మోసగిస్తున్న సిఎం జగన్

- పాదయాత్రలో నారా లోకేష్

యువత సదస్సులో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాష్ట్రంలోని యువతను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మోసగిస్తున్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 44వ రోజుకు చేరుకుంది. గురువారం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట మండలంలోని ఇందిరమ్మకాలనీ నుంచి ప్రారంభమైన పాదయాత్ర మల్లెల క్రాస్, టి.సదుం క్రాస్, సొన్నువారిపల్లి మీదుగా పెదతిప్పసముద్రం మండలంలోకి పాదయాత్ర ప్రవేశించింది. అక్కడి నుంచి మద్దయ్యగారిపల్లి శివారు వరకు పాదయాత్ర సాగింది. కొమ్మరపల్లి విడిది కేంద్రంలో బస చేశారు. ఆయా ప్రాంతాల్లో స్థానికులు, యువతతో ముఖాముఖి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలు చోట్ల లోకేష్ మాట్లాడుతూ వైసిపి పాలనలో యువత ఎక్కువగా నష్టపోయిందని తెలిపారు. టిడిపి పాలనలో ఎపి జాబ్స్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా ఉండేదన్నారు. జగన్ పాలనలో ఎపిని గంజాయి క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా మార్చేశారన్నారు. 60 వేల మెజారిటీతో గెలిచిన ఎమ్మెల్యే కనీసం గత ప్రభుత్వం కేటాయించిన డిగ్రీ కళాశాల పూర్తి చేయలేని పరిస్థితి ఉందన్నారు. 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని, ప్రతి ఏడాది 6,500 పోలీసు ఉద్యోగాలు భర్తీ చేస్తానని మోసం చేశారని పేర్కొన్నారు.. ప్రతి ఏడాది డిఎస్సీ అన్నారన్నారు. ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయలేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఏడాది నోటిఫికేషన్ ఇస్తామని, అన్ని ఖాళీ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. జైలుకి వెళ్ళిన ఆర్థిక ఉగ్రవాదిని చూసి పెట్టుబడులు పెట్టడానికి ఎవరు వస్తారని, కోడి గుడ్డు మంత్రిని చూసి ఎవరు వస్తారన్నారు. జగన్ పాలనలో వచ్చిన ఒక్క పరిశ్రమ చూపించమని ఛాలెంజ్ చేస్తున్నానని పేర్కొన్నారు. టిడిపి తెచ్చిన కంపెనీలకి రిబ్బన్ కటింగ్ చేయడం తప్ప మీరు తెచ్చిన కంపెనీ ఒక్కటి అయినా ఉందా అని ప్రశ్నించారు. ఓట్ల కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి ఆ తర్వాత మాటతప్పి మడమతిప్పడం జగన్ నైజమన్నారు. బుడుగ, బేడజంగాల సమస్యపై అధ్యయన కమిటీ నివేదిక పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు. ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సబ్సిడీ రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టిడిపి అభ్యర్థి గంటా నరహరి, నియోజకవర్గం ఇన్‌ఛార్జి జి.శంకర్ యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్ తాజ్, టిడిపి రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం చేస్తున్న లయన్స్, వాకర్స్ క్లబ్ సభ్యులు

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-నందలూరు

లయన్స్‌క్లబ్, వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పేదలకు అన్నదాన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమంలో భాగస్వామిగా ఉంటున్న కానకుర్తి వెంకటయ్య, విజయ దంపతుల వివాహ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని ఆరవపల్లె ఆర్అండ్‌బి బంగ్లా ఆవరణలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదానం గొప్పదని, ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నటువంటి లయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్ వారికి పలువురు ధన్యవాదాలు తెలిపారు. స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేస్తున్న సంస్థలకు దాతలు ముందుకు వచ్చి వారిని ప్రోత్సహించవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ మన్నెం రామ్మోహన్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు కుర్రా మణి యాదవ్, కొత్తపల్లి రాజాచారి, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు శ్యామనబోయిన గురుప్రసాద్, వాకర్స్ క్లబ్ సెక్రటరీ మోడపోతుల రాము, సభ్యులు చామంచి పెంచలయ్య, జంగంశెట్టి హరిప్రసాద్, సునీల్‌రెడ్డి, మేస్త్రీ శంకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

22న ఆధ్యాత్మిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 22వ తేదీన పట్టణంలోని కడప-రాజంపేట ప్రధాన రహదారిలో గల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ, ఆధ్యాత్మిక ప్రవచకులు విద్వాన్ కొత్త నరసింహులు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లాల టిటిడి ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ బి.గోపీబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది రోజున సాయంత్రం 6 గంటలకు యతిరాజుల హరినాథశర్మచే పంచాంగ శ్రవణం ఏర్పాటు చేసి ఉగాది పచ్చడి, వడపప్పు-పానకం ప్రసాదం అందిస్తామని అన్నారు. 23 నుంచి అనుభవజ్ఞులైన ప్రవచకులచే ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు ఏడు రోజులు పాటు ఏడు అంశాలు పైన రామాయణ సప్తాహం ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రుణాలు సక్రమంగా చెల్లించేలా చూడాలి

ప్రజాశక్తి-వీరబల్లి

స్వయం సహాయక సంఘాల్లో తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించేలా సిబ్బంది బాధ్యత తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ బండి సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన మండల సమాఖ్య సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ్యులు రుణాలు పొందే క్రమంలో సమావేశం ఏర్పాటు చేసి మంచి జీవనోపాధులను ఎన్నుకొనేలా అవగాహన కల్పించడం సిబ్బంది బాధ్యత అని గుర్తుచేశారు. జీవనోపాధుల కొరకు రుణాన్ని పెట్టుబడిగా పెట్టుకోవడం వల్ల చెల్లింపులు బాగుంటాయన్నారు. సంఘం సమావేశాల్లో రుణాలను ఏవిధంగా ఉపయోగించుకోవాలి, దానివల్ల ప్రయోజనాలను తెలియజేయాలని చెప్పారు. సమావేశాలు జరపకుండా లావాదేవీలు నిర్వహించడం వల్ల పారదర్శకత లోపించి సంఘాలు విచ్ఛిన్నం అవుతాయని అన్నారు. పుస్తక నిర్వహణ, లావాదేవీలు ఆన్‌లైన్‌లో నమోదు ప్రతినెల జరగాలని చెప్పారు. ప్రతినెల జరిగే అన్ని లావాదేవీలు తనిఖీ చేసుకోని సభ్యులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఏపిఎం ఖాదర్ వలి, స్త్రీనిధి మేనేజర్ సుధీర్, మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ ఇస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

రైతులకు సేంద్రియ పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జిఎస్.పాండురంగ ఆధ్వర్యంలో రైతులకు సేంద్రియ పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిచారు. గురువారం తమిళనాడుకు చెందిన కృష్ణగిరి రైతులకు పంటలలో సేంద్రియ పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతులు ద్వారా పండించిన ఉత్పత్తులు తీసుకోవడం ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని అన్నారు. రైతులు చింతమాకులపల్లిలో సేంద్రియ పద్ధతుల ద్వారా సాగు చేస్తున్న మామిడి తోటలను, రైతు డి.సునీల్ కుమార్ రెడ్డి పాటిస్తున్నటువంటి సేంద్రియ పద్ధతులైన వేప నూనె, మట్టి ద్రావణం, జీవామృతం విషయాలను కెవికెలో రైతులకు తెలిపారు. చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి శాస్త్రవేత్త ఐ.జ్యోతి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ పీరు, డాక్టర్ కె.మాధురి, కె.నవీన, డాక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యా సామగ్రితో విద్యార్థులు

పట్టణం లోని యూత్ క్లబ్ కరాటే నిర్వాహకులు డాక్టర్ ఎఆర్.సురేష్ ఆధ్వర్యంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ మనోజరెడ్డి పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలు రాస్తున్న ప్రతి ఒక్క విద్యార్థికి శుభాభినందనలు తెలిపారు. పట్టణంలో హోప్ మున్సిపల్ హోప్ పాఠశాల పిల్లలు పదో తరగతి పరీక్షలు బాగా రాసి పట్టణ మొదటి ర్యాంకు, రెండవ ర్యాంకులు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యా సామగ్రిని అందించిన దాతను మున్సిపల్ చైర్‌పర్సన్, ప్రధానోపాధ్యాయులు ఎం.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, ఆర్.సురేష్‌లు అభినందించారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE: RAJAMPET
O.S.NO: 159/19

బి.వెంకటేశ్వర్లు.

...వాది

Vs

1. పి.పుల్లమ్మ (D3)
2. పి. ప్రత్యేష (D4)
3. పి.శివ (D5).

...ప్రతివాదులు

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా పై కేసులో 1వ ప్రతివాది పి.చిరంజీవి చనిపోయినందున ఆయన వారసులుగా పై కేసులో మిమ్ములను ప్రతివాదులుగా చేర్చడమైనది. సదరు కేసు 24.3.2023వ తేదీ నాటికి వాయిదా వేయడమైనది. కావున మీరు 24.3.2023వ తేదీన ఉదయం 10.30ని॥లకు పై కోర్టులో నేరుగా కాని వకీలు ద్వారా కాని హాజరై ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెయును. లేనంతట మీ పరోక్షమందు తీర్మానించబడును.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

P.HANUMANTHA NAIDU
వాది పరం అడ్వకేట్,
రాజంపేట.

పాస్‌పోర్ట్ పోయినది

అన్నమయ్య జిల్లా, పుల్లంపేట మండలం, బోటుమీదపల్లె గ్రామానికి చెందిన డొంకా ప్రసాద్ S/o డొంకా శ్రీనివాసులు అను నా యొక్క V0998462 అను నంబరు గల పాస్పోర్టు 25-11-2022వ తేదీన తిరుపతి నుంచి రాజంపేటకు ఆర్టీసీ బస్సులో వస్తుండగా మార్గమధ్యంలో పాస్పోర్టు పోయినది. కావున ఎవరికైనా దొరికినచో కింది నంబర్‌కు సమాచారం అందించగలరని మనవి.

ఫోన్ నెంబర్ :7093975329.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు : కలెక్టర్

పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, జెసిలు

ప్రజాశక్తి-రాయచోటి

తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిన మహోన్నత వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ల్లో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీష మాట్లాడుతూ తెలుగు మాట్లాడే వారందరికీ ప్రత్యేక రాష్ట్రం కావాలని, తన త్యాగాల ఫలితంగా తెలుగు రాష్ట్రం సాధించిన మహోన్నత వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన మహాపురుషుడు అన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నారని, ఆమరణ నిరాహారదీక్ష చేసి ఆంధ్రరాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలు అర్పించిన ధీరోదాత్తుడు అన్నారు. మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం పనిచేసిన మహనీయుడు అని తెలిపారు. అటువంటి మహనీయుడుని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమిమ అన్సారీయా, రాజంపేట సబ్ కలెక్టర్ పర్మన్ అహ్మద్‌ఖాన్, కలెక్టర్ ఎఒ బాలకృష్ణ, బిసి వెల్ఫేర్ అధికారి సందప్ప, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** బాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటుకు కృషిచేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఎస్‌పి హర్షవర్ధన్ రాజు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి తన ప్రాణాలను సైతం అర్పించిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ఆశయాలను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐబి డిఎస్‌పి రవి, ఆర్‌ఐ మహబూబ్ వలీ, డిసిఆర్‌బి సిఐ రాజేంద్రప్రసాద్, దిశ సిఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కొరకు ప్రాణాలర్పించిన అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు అని ఎంపిడిఒ శంకరయ్య పేర్కొన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు 122వ జయంతిని పురస్కరించుకొని స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో వివిధ శాఖల అధికారులతో కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఒ థామస్ కుమార్, ప్రతాప్, ఆర్ డబ్ల్యూఎస్ ఎఇ దినేష్ కుమార్, ఎపిఒ మంజుల, ఫాజిల్, రజినీ, నారాయణ, శ్యామల, గంగాద్రి, చంద్ర, రమణ, పుణ్యవతి, నరసింహులు, విశ్వనాథ రెడ్డి, బాస్ నాయకులు సచిన్, నక్కా మహేష్ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** మండల పరిధిలోని అమ్మచెరువు మిటలోని వెలుగు వృద్ధాశ్రమం నందు గురువారం మదనపల్లె వాసవి వనిత క్లబ్, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వాసవి ఇంటర్నేషనల్ క్లబ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుంకు చంద్రశేఖర్, వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్ బిఎ.క్రాంతి రేఖ, వాసవిక్లబ్ ప్రెసిడెంట్ బి. నరేంద్ర హజరయ్యారు. వెలుగు కన్వీనర్ ఆర్. భాగ్యలక్ష్మి , సోషల్ వర్కర్ యం. గీతస్వాగతం పలికారు. యం. గీత వెలుగు వృద్ధాశ్రమం యొక్క కార్యక్రమాలను గురించి తెలియజేశారు. ప్రపంచం లోని 60 దేశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నామన్నారు. ము ఖ్యంగా వృద్ధులకు సేవచేయడం ఎంతో హర్షించ దగ్గ విషయమని అన్నారు. వృద్ధా శమంలోని వృద్ధులకు డైపర్లు, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, వృద్ధులు పాల్గొన్నారు. **వాల్మీకిపురం :** భాషాప్రయుక్త రాష్ట్రాల కోసం ఉద్యమించి తెలుగు రాష్ట్ర ఆవిర్భావానికి తన ప్రాణాన్ని త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు అమరజీవి అని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేశారని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మెహరున్నీసాబీబి, ఉపాధ్యాయులు రామ లక్ష్మమ్మ, గౌతమి, శ్రావణి, దీపిక, రేఖ, కల్పన, లావణ్య, సరస్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న ఎస్‌పి హర్షవర్ధన్ రాజు

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

పీలేరు : పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. చీఫ్ ఎగ్జామినర్ రామాంజనేయ ప్రసాద్, డిపార్ట్ మెంటల్ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పరీక్షలు జరిగాయి. ఐదుగురు ఇన్విజిలేటర్లు ఐదు గదులలో పరీక్షలు నిర్వహించారు. 118 మందికి విద్యార్థులకు గాను 115 మంది విద్యార్థులు తెలుగు ,హిందీ పరీక్షలు రాశారు. ముగ్గురు విద్యార్థులు వివిధ కారణాలతో పరీక్షలకు గైర్హాజరయినట్లు చీఫ్ ఎగ్జామినర్ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ రెడ్డప్ప రెడ్డి తనిఖీ బృందం పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. **రామాపురం :** మండల కేంద్ర పరిధి లోని ఆదర్శ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 240 మంది విద్యార్థులకు గాను 223 మంది పరీక్ష లు హాజరుకాగా, 17 మంది పరీక్ష గైర్హాజర్ అయినట్లు పాఠశాల ప్రిన్సిపల్ చీఫ్ శ్యామలాదేవి తెలిపారు. **పీలేరు :** ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం మొదటిరోజు పరీక్షకు 40 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలో నాలుగు పరీక్షా కేంద్రాలుండగా ద్వితీయ సంవత్సరం ఇంటర్ తెలుగు, ఉర్దూ, సంస్కృత పరీక్షకు 1,047 మంది విద్యార్థులను కేటాయించారు. వారిలో1007 మంది విద్యార్థులు మాత్రమే ఫరీక్షకు హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రానికి 260 మంది విద్యార్థులను కేటాయించగా వారిలో 252 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. అలాగే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 270 మందికి 262 మంది, అంబేద్కర్ బాలికల గురుకుల కళాశాలలో 275 మందికి 263, చైతన్య జూనియర్ కళాశాలలో 242మందికి 230 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఆయా కళాశాల ప్రిన్సిపల్స్ తెలిపారు.

బహిరంగ సభకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-ములకలచెరువు

సభా స్థలాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ములకలచెరువులో శుక్రవారం జరిగే భారీ బహిరంగ సభా ప్రదేశాన్ని రాజంపేట పార్లమెంటు టిడిని ఎంపీ అభ్యర్థి గంటా నరహరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి శంకర్ యాదవ్ గురువారం పరిశీలించారు. లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి అనంతపురం జిల్లాలో అడుగు పెట్టనున్న సందర్భంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువులో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సభ స్థలిలో వాహనాల పార్కింగ్, లోకేష్ ప్రసంగించే స్థలం, నీటి సౌకర్యాన్ని పరిశీలించి ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్లు పాలగిరి సిద్ధ, రమణ, నాయకులు చెన్నక్రిష్ణ, కేశవ పాల్గొన్నారు.

18న ప్రత్యేక లోక్ అదాలత్

తంబళ్లపల్లి : స్థానిక తంబళ్లపల్లి న్యాయస్థానంలో ఈనెల 18న స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహిస్తారని మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ తెలిపారు. స్పెషల్ లోక్ అదాలత్‌లో కుటుంబ సమస్యలకు సంబంధించిన కేసులు రాజీమార్గంలో పరిష్కరిస్తారని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓటరు కార్డుకు ఆధార్ తప్పనిసరి

ప్రజాశక్తి-కురబలకోట

ఓటరు కార్డుకు ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు అనుసంధానం తప్పనిసరిగా చేసుకోవాలని తహశీల్దార్ ఎం.భీమేశ్వరరావు కోరారు. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రధానంగా బిఎల్ఒలు ప్రత్యేక శ్రద్ధ వహించి సోమవారం లోగా ఆధార్ అనుసంధానం పూర్తిచేయాలన్నారు. బాధ్యతా రహితంగా వ్యవహరిస్తే చర్యలులి తప్పవని హెచ్చరించారు. మండలంలో 32,813 మంది ఓటర్లు వున్నారన్నారు. వీరిలో మహిళలు 16,571, పురుష ఓటర్లు 16,242 మంది ఉన్నారన్నారు. ఇప్పటి వరకు 26,992 ఓటర్ కార్డులకు ఆధార్ అనుసంధానం జరిగిందన్నారు. మిగిలిన ఓటర్లు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వెంటనే తమ ఓటర్ కార్డుకు బిఎల్ఒల వద్ద ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. బిఎల్ఒలకు విఆర్ఒలు, రేషన్ డీలర్లు. అంగన్వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శుల, విఆర్ఎలులు, గ్రామ వాలంటీర్లు సహకరించి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. **రామాపురం :** ఓటర్ కార్డుకు ఆధార్ కార్డు అనుసంధానం చేయాలని తహశీల్దార్ వైఎస్.సత్యనందం అన్నారు. విఆర్ఒలు, బిఎల్ఒలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని బిఎల్ఒలు, ఓటర్ కార్డుకు ఆధార్ అనుచందానం చేయాలని అన్నారు. ఇప్పటివరకు మొత్తం ఓట్లు 25.636 ఉండగా 21.790 వరకు ఓటర్ కార్డు కు ఆధార్ కార్డు అనుచందనం చేయాలని ఆయన వారికి సూచించారు.

రేపు వారపుసంత వేలం

ప్రజాశక్తి-ములకలచెరువు

ఈనెల 18న శనివారం ములకలచెరువు వారపుసంత, రోజువారి మార్కెట్ గుత్తను వాసుళ్ల చేసుకునే హక్కు కల్పించడానికి వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలంకు వారపుసంతకు రూ.1.25 లక్షలు, డైలీ మార్కెట్‌కు రూ.75 వేలు డిపాజిట్ సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

పాదయాత్రకు సిపిఐ సంఘీభావం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 44వ రోజు బి.కొత్తకోట మండల పరిధిలో సాగింది. గురువారం స్థానిక పిటిఎం రోడ్డు నందు సిపిఐ నాయకులు పాదయాత్రకు తమ సంఘీభావం తెలియజేసి నారా లోకేష్ వెంట కొంత దూరం పాదయాత్ర చేశారు. నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా నెలకొన్న ప్రజా సమస్యలను క్షుణ్ణంగా వివరించి వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎస్.మనోహర్ రెడ్డి, ఎస్.సలీం బాషా, సహాయ కార్యదర్శి ఎస్.జవహర్ బాబులు పాల్గొన్నారు.

ఎంజెఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-పీలేరు

పట్టణంలోని ఎంజెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల ప్రాంగణ ఎంపిక జరిగిందని కళాశాల చైర్మన్ ఎంపి అవినాష్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి తెలిపారు. ఎపిటి ఆన్‌లైన్ లిమిటెడ్ ఎటిసిఎస్ జాయింట్ వెంచర్ కంపెనీ ఆధ్వర్యంలో కె. సత్య, రవి, హెచ్‌ఆర్ రెండు దశలుగా విద్యార్థులను పరీక్షించారన్నారు. మొదటి రౌండ్ వ్రాత పరీక్షకు 104 మంది విద్యార్థులు హాజరు కాగా, రెండవ దశ టెక్నికల్ రెండుకు 18 మంది ఎంపిక కయ్యారని, చివరిగా 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు రూ.3లక్షలు జీతంతో ప్యాకేజీ పొందుతారని కంపెనీ హెచ్‌ఆర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి అభినందించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ

రాయచోటి : మండల పరిధిలోని కాటుమాయికుంట గ్రామంలో కాటిమాయకుంట కస్పాలో గ్రామ సచివాలయం, అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి, ఐసిడిఎస్ పీడీ ఎం.ధనలక్ష్మి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రం, స్వమిత్వా, గ్రామ సచివాలయంను పరిశీలించారు. తనిఖీలో భాగంగా ఎస్‌డబ్ల్యుపిసి సెంటర్ నిర్వహణ, పర్యవేక్షణ మెరుగు పరుచుకోవాలని తెలియజేశారు. గ్రామ సచివాలయం నిర్వహణ మీద సంతృప్తి చెందారు. కాటిమాయకుంట కస్పాలోని రెడ్డివారిపల్లి అంగన్వాడీ కేంద్రం నిర్వహణ, పిల్లల హాజరు, గర్భిణుల హాజరు, కేంద్రం నిర్వహణపై అసంతృప్తి వ్యక్తంచేశారు. అంగన్వాడీ టీచర్, ఐసిడిఎస్ సూపర్వైజర్‌లకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు శంకర్‌రెడ్డి, ఖాదర్‌వలీ, ఇఒపిఆర్‌డి సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-రాయచోటి

పాలిటెక్నిక్ విద్యార్థులు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ సమయంలో ఉద్యోగ సంబంధిత నైపుణ్యాలలో ప్రాక్టికల్ నాలెడ్జ్‌ని పెంపొందించుకోవాలని రిసోర్స్ పర్సన్ సన్‌గ్లేర్ టెక్నాలజీ హైదరాబాద్ ప్రాజెక్టు మేనేజర్ ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. గురువారం రాయచోటి శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఆవశ్యకత అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా సన్ గ్లేర్ టెక్నాలజీస్, హైదరాబాద్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆదిత్యనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ప్రాముఖ్యతను వివరించారు. ట్రైనింగ్ సమయంలో వృత్తికి సంబంధించిన వాతావరణాన్ని అలవర్చుకోవడం, కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలన్నారు. అంతరం సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ సమయంలో ప్రతి విభాగపు విద్యార్థులకు స్టైఫండ్‌తో పాటు ఉచిత భోజన వసతి సౌకర్యాలను కల్పిస్తారని చెప్పారు. ఈ సమయంలో వృత్తి శిక్షణ నైపుణ్యత పత్రాన్ని అందిస్తారని తెలిపారు. ఇండస్ట్రియల్ ట్రైనింగ్ విద్యార్థిని విద్యార్థులకు హ్యాండ్స్ ఆన్ ఎక్స్పీరియన్స్ అనుభవాన్ని కల్పిస్తుందని తద్వారా అకాడమిక్ అంశాలపై పూర్తి అవగాహన కలుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెమొంటోను అందజేస్తున్న జడ్‌పి చైర్మన్, ఎంపిపి

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ప్రజాశక్తి-నందలూరు

విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి, ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డిలు కోరారు. బుధవారం సాయంత్రం గొబ్బిళ్ళ అక్షర పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవాన్ని చైర్మన్ గొబ్బిళ్ళ త్రినాధ్, కరస్పాండెంట్ గొబ్బిళ్ళ శ్రీనాథ్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణతో మెలగాలన్నారు. స్పెషల్ ఆక్టివిటీస్ లో మెరుగైన ఫలితాలను సాధించిన విద్యార్థులకు మెడల్స్, మెమొంటోలను అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు కోసం సంస్థ చేపడుతున్న కార్యక్రమాలకు తల్లిదండ్రులు సహకారాన్ని అందించాని కోరారు. విద్య, క్రమశిక్షణ, శానిటేషన్, డిజిటల్ క్లాస్సెస్, ఆర్గానిక్ అగ్రికల్చర్, లాబ్స్‌తో పాటు స్కూల్ చేపడుతున్న కార్యక్రమాల గురించి నిశితంగా వివరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఉత్తమ ఫలితాలు సాధించాలి'

ప్రజాశక్తి-నందలూరు

పదవ తరగతి విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఇఒ గంగిరెడ్డి కోరారు. గురువారం నాగిరెడ్డి పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు పుల్లయ్య తనయుడు వరప్రసాద్ ఆధ్వర్యంలో పరీక్ష విద్యా సామాగ్రి పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు టీవీలకు, ఫోన్లకు దూరంగా ఉంటూ బాగా చదివి పరీక్షల్లో రాణించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధర్, కాజా హుస్సేన్, చాన్ భాష, చంద్రకాంత్, స్వర్ణలత, గౌరీ, రమణమ్మ పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.51 వేలు విరాళం

నిమ్మనపల్లి : మండలంలోని తవళం గ్రామంలోని శ్రీయోగ నేలమల్లేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి నిమ్మనపల్లి పంచాయతీ పెద్దమాదిగపల్లెకు చెందిన కె.లక్ష్మీదేవి కుటుంబ సభ్యులతో కలిసి రూ.51,116లను విరాళంగా ఆలయ తాత్కాలిక కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, ఆలయ అర్చకులు శంకర శాస్త్రిలకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాను బెంగళూరులోని ఓ ప్రయివేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పనిచేస్తున్నానన్నారు. మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ నేలమల్లేశ్వర స్వామి అభివృద్ధిని ఆకాంక్షించి తన వంతు సాయంగా విరాళాన్ని అందించడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు గోపాలకృష్ణ దాతలు కే.లక్ష్మీదేవి, కుటుంబ సభ్యులు కె.మోహన లను దుశ్శాలువాతో సత్కరించారు. అర్చకులు శంకర శాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించి వారికి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో దాతలు లక్ష్మీదేవి, మోహన, వాలంటీర్ కె.వెంకటేష్ పాల్గొన్నారు.

సిఎం సహా అందరికీ గేట్ పాస్ రెడీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న మహేష్

జనసేన పార్టీ 10వ ఆవిర్భావ సభకు వచ్చిన స్పందన చూసి వైసిపి వారికి వణుకు మొదలైందని, తమకు గేటు పాసులు ఇవ్వడం కాదు, రాబోవు ఎన్నికల్లో సిఎం సహా అందరిని ఇంట్లో కుర్చోబెట్టడానికి ప్రజలే మీకు గెటుపాస్ రెడీ చేశారని జనసేన పార్టీ దక్షిణ రాయల కోస్తా పార్లమెంటరీ సమన్వయ కర్త డాక్టర్ మైఫోర్స్ మహేష్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరనాథ్, జబర్దస్త్ రోజా, అంబటి, పేర్నినాని లాంటి వారు నోరు పారేసుకోవడం మానుకోవాలని హెచ్చరించారు. జనసేన పార్టీ నిర్వహించిన మచిలీపట్నం సభకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలి రావడం శుభపరిణామం అన్నారు. సిఎం సభలకు జనాన్ని తోలుకు వచ్చి వారిని కుర్చోబెట్టడానికి వైసిపి నాయకులు నానా తంటలు పడితే జనసేన పార్టీ సభకు వచ్చిన జనం ఎంతో క్రమ శిక్షణగా ఉన్నాని చెప్పారు. అంబులెన్స్‌లకు దారి ఇవ్వలేదని, జనం లేరనే తప్పుడు కథలను రాయడం సరైందని కాదన్నారు. పొత్తుల విషయాన్ని పవన్ కళ్యాణ్, చంద్రబాబునాయుడు చూసుకుంటారని చెప్పారు. పవన్ కళ్యాణ్ సూచనలతో జనసేన పార్టీ బలోపేతం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ప్రకటించారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకులు మల్లిక, శోభ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

మహిళలను గాయపరిచిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని దిగుతాండ పంచాయతీ దిగుతాండకు చెందిన అంజేష్ నాయక్ భార్య స్వాతి బాయ్ ని అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్ నాయక్ ,సునీల్ నాయక్ లు కలసి కొట్టి గాయపరిచినట్లు స్వాతి భాయ్ భర్త అంజేష్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పోలీసులు సీజ్ చేసిన కారు, 41 కేస్‌ల కర్ణాటక మద్యం

కారుతో సహ రూ.5లక్షలు విలువైన 41 కేస్‌ల కర్ణాటక మద్యం సీజ్ చేసినట్లు సెబ్ సిఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. కారులో కడప జిల్లాకు కర్ణాటక మద్యం తరలిస్తుండగా మదనపల్లె ఎస్ఇబి పోలీసులకు ఐదుగురు బడా స్మగ్లర్లు పట్టుబడ్డారని తెలిపారు. అందించిన సమాచారం మేరకు తంబళ్లపల్లె అంజి నాయక్, బి.కొత్తకోట మోహన్, చేనేతనగర్ డాబా సూరి అలియాస్ సూర్యనారాయణ రెడ్డి, రాయచోటి, రామాపురం ప్రభాకర్ చౌదరి, ఉప్పురోల్లపల్లి గోపాల్ లను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. నిందిలపై కేసు నమోదు చేసి కోర్టుకు హజరు పరచినట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి-నందలూరు

మండల కేంద్రమైన నందలూరు దిగువ వీధికి చెందిన పత్తూరి పావని(19) ఈనెల 14వ తేదీ నుంచి అదృశ్యమైనట్లు ఎఎస్ఐ సుబ్బరాయుడు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. తల్లిదండ్రులు కువైట్‌లో ఉండగా, పావని తన నాన్నమ్మ కలిసి ఉండి, 10 వరకు చదువుకొని ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటుందన్నారు. ఈనెల 14వ తేది ఉదయం సమయం లో ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు కోసం మీసేవకు వెళ్లి వస్తానని ఇంటికి రానట్లు, పావని నానమ్మ పత్తూరి లక్ష్మీదేవి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ సుబ్బరాయుడు తెలిపారు.